క్లుప్తంగా

శుభ్రత అందరి బాధ్యత

నవాబుపేట: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ జయరాంనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కోళ్లగుట్టతండా, మల్కాపూర్, కామారం, పోమాల్ తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ముందుగా పంచాయతీ కార్యాలయాల్లో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. అదే విధంగా వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతు చేయించాలని తెలిపారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ జ్యోతి, ఎంపీహెచ్ఓ భద్రునాయక్ ఉన్నారు.

అనుమతి తప్పనిసరి

రాజాపూర్: వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ రవి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏర్పాటుచేసే వినాయక మండపాలకు అనుమతి తీసుకుంటేనే జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. నిమజ్జనం రోజున అవసరమైన బందోబస్తు కల్పిస్తామన్నారు. ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

సారా తయారీదారుడికి రూ. లక్ష జరిమానా

జడ్చర్ల: భూత్పూర్ మండలం నల్లకుంటతండాకు చెందిన విస్లావత్ చిన్న రాములుకు గురువారం రూ. లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. రెండు నెలల క్రితం విస్లావత్ చిన్నరాములు సారా విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని భూత్పూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా మళ్లీ సారా విక్రయాలు, తయారీకి పాల్పడవద్దని.. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించడం జరిగింది. కాగా, బుధవారం నల్లకుంట తండాలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టగా.. అతడి ఇంట్లో సారా పట్టుబడటంతో నిబంధనల మేరకు రూ. లక్ష జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. తనిఖీలలో ఎస్ఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

భీమయ్యగౌడ్ మృతి పార్టీకి తీరనిలోటు

మిడ్జిల్: మండల మాజీ జెడ్పీటీసీ భీమయ్యగౌడ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోయిన్‌పల్లిలో గురువారం భీమయ్యగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే వివరించారు. అనంతరం పాలశీతలికరణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే వెంట రబ్బానీ, అల్వాల్‌రెడ్డి, సాయిలు, గౌస్, వెంకటయ్య, ప్రశాంత్‌రెడ్డి, బంగారు ఉన్నారు.

ఆల్‌మేవా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వహీద్‌షా

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్‌మేవా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ వహీద్‌షా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వహీద్‌షా ప్రస్తుతం ఆల్‌మేవా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అదే విధంగా జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఫరీద్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభా వంతులైన 10 మంది విద్యార్థులకు గురువారం అదే గ్రామానికి చెందిన మాలెల శశిధర్‌గౌడ్ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఆయన ఇటీవల పాఠశాలలో 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించిన సందర్భంగా ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజయకుమార్‌గౌడ్, ఇంతియాజ్, ఆల సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడుగురికి సెల్‌ఫోన్ల అప్పగింత

మహబూబ్‌నగర్ క్రైం: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అపహరణకు గురైన ఏడుగురి సెల్‌ఫోన్లను గుర్తించి, గురువారం అప్పగించినట్లు సీఐ అప్పయ్య తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన సీఈఐఆర్ పరిజ్ఞానంతో చోరీలకు గురైన ఫోన్లను గుర్తించి బాధితులకు అందిస్తున్నట్లు చెప్పారు.

రెండు ఆటోలు ఢీ

- డ్రైవర్లతో సహా మరో ఇద్దరికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్లతో సహా మరో ఇద్దరికి గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై వర్షం కురుస్తున్న సమయంలో రెండు ఆటోలు ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటో డ్రైవర్లతో పాటు ఆటోల్లో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.



కలెక్టర్ విజయేందిర చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న అయ్యవారిపల్లి జీహెచ్ఎం సుధాకర్



రాణి మాలినిదేవి, కర్వెన | మల్లిక, కోయిల్‌సాగర్ | రుక్మిణి, మునిమోక్షం | వెంకటనాగేంద్ర ప్రసాద్, జానంపేట | స్వప్న, జీపీహెచ్ఎస్ మహబూబ్‌నగర్ | షహేదాబేగం, కొనపాలమూరు | నిఖత్‌జహాన్, వస్పుల | రజిని, కార్కొండ | సత్యనారాయణరెడ్డి, నసరుల్లాబాద్ | సునీత, వస్పుల



జనార్దన్, గండేడ్ | క్రిష్టియాన, ధర్మాపూర్ | వెంకటేష్, ఉడిత్యాల | ఎక్బాల్ సుల్తానా, వేపూర్ | విష్ణువర్ధన్‌గౌడ్, కల్లెంపల్లి | జగన్మోహన్ గౌడ్, గుండ్యాల | టి.కవితాదేవి, మణికొండ | శైలజ, అప్పాయిపల్లి | విజయలక్ష్మి, తిమ్మయ్యపల్లి | రమాదేవి, వడ్డేపల్లి | శ్వేత, గుడిబండతండా | ప్రఫుల్లాచంద్ర, నారాళ్లపల్లి | రంజిత్‌కుమార్, దమగ్నాపూర్ | వెంకట్రామ్, పల్లమర్రి



శ్రీనివాస్, ఫరీద్‌పూర్ | సోమేశ్వర్‌రెడ్డి, నార్లోనికుంట | శ్రీనివాస్, బస్వాయపల్లి | జయప్రద, హన్వాడ | పురేందర్‌రెడ్డి, పుట్టపల్లి | కవిత, మూసాపేట | శ్రీనివాసులు, కాకర్లపహాడ్ | రాంచంద్రయ్య, కొల్లూరు | అంజలీ చౌహాన్, కుతినేపల్లి | శంకరమ్మ, మ.నగర్ అర్బన్ | సుమతి, అడ్డాకుల | మంజుల, కోయిల్‌కొండ | అర్చనాసింగ్, నవాబ్‌పేట



పాలమూరు యూనివర్సిటీలో..



సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో..



జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో..

గురువులు.. భవితకు బాటసార్లు



జిల్లా కేంద్రంలో టీచర్లను సన్మానించిన ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి



మిడ్జిల్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: సమాజానికి దిక్సూచి గురువులు అని.. నవసమాజ నిర్మాణంలో వారి కృషి ఎనలేనిదని పలువురు కొనియాడారు. గురువారం జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులతో పాటు వివిధ పార్టీల నాయకులు శాలువాలతో సత్కరించారు.

- మిడ్జిల్ కేజీబీవీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ జగదీశ్వర్, హెచ్ఎం సరస్వతి, ప్రత్యేకాధికారి కవిత పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రీజినల్ మేనేజర్ శ్రీదేవి, డిప్యూటీ ఆర్ఎంలు లక్ష్మీధర్మ, శ్యామల, డీఎం సుజాత ఉపాధ్యాయులను సత్కరించారు.
- మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్లు వడ్ల సత్యనారాయణ, అబ్దుల్ వాహెద్ పాల్గొన్నారు.
- అడ్డాకుల మండలంలోని రాచాల పాఠశాలలో ఏర్పాటుచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ కాంస్య విగ్రహాన్ని 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, పూర్వపు ఉపాధ్యాయులు ఆవిష్కరించారు.
- భూత్పూర్ మున్సిపాలిటితో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.
- నవాబుపేట మండలంలోని కాకర్లపహడ్ పీఎస్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, కారుకొండ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయిని రజిని, కొల్లూర్ పీఎస్ ఉపాధ్యాయుడు రాంచంద్రయ్య మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. అదేవిధంగా నవాబుపేటలో రిటైర్డ్ ఉపాధ్యాయులను సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం, మాజీ జెడ్పీటీసీ ఇందిరాదేవి, ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.
- మహమ్మదాబాద్ మండలం నంచర్ల ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం.నారాయణ సన్మానించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, హెచ్ఎంలు సురేందర్‌రెడ్డి, భీంరెడ్డి పాల్గొన్నారు.
- హన్వాడ మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కిష్యానాయక్, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- కోయిల్‌కొండ, గార్లపహాడ్, పారుపల్లి పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ నాయక్, పీఆర్టీయు నాయకులు గోపాల్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, వెంకటాజీ, వెంకటేష్ పాల్గొన్నారు.
- బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 9 ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారి అర్జున్ కుమార్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగసుధ, జావేద్, అరుంధతి పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, నాగభూషణం, నారాయణరావు, విజయ్‌కుమార్, బాలకృష్ణ, రాజసింహుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.
- జేపీఎన్‌సీ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో సినీ నటుడు మైమ్ మధు పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవికుమార్, పిన్సిపాల్ సుజీవన్, కృష్ణమూర్తి, సందీప్‌కుమార్, గౌతమ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలోని రిషి పాఠశాలలో డైరెక్టర్ పూజితా మోహన్‌రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, సాయి సుశాంత్‌కృష్ణ, శిరీష ప్రవీణ్, ప్రిన్సిపాల్ వెంకటరమణ పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో స్కూల్ ఏజీఎం భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్, కోఆర్డినేటర్ మధు, ప్రైమరీ కోఆర్డినేటర్ మృదుల, మహేష్, ప్రియ, సుమతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూత

దేవరకద్ర రూరల్: మండలంలోని డోకూర్ తపోవన్ పాఠశాల ఇంగ్లిష్ టీచర్ నాగరాజు మూడునెలల క్రితం మృతిచెందారు. అతడి కుటుంబానికి తోటి ఉపాధ్యాయులు రూ. 85 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. నాగరాజు పిల్లలు చదువుకు సంబంధించి పదో తరగతి వరకు అన్ని ఖర్చులను పాఠశాల యాజమాన్యం భరిస్తుందని ప్రిన్సిపాల్ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు



కోయిల్‌కొండలో..



రిషి పాఠశాలలో..



మూసాపేటలో..

ఎరువుల విక్రయ రశీదు ఇవ్వాలి

రాజాపూర్: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఏఓ ప్రదీప్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని తిర్మలాపూర్‌లో సీడ్స్ అండ్ పెస్టిసైడ్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల స్టాక్ తదితర రికార్డులను పరిశీలించారు. ఎరువుల ధరలు, స్టాక్ వివరాలను తెలియజేసేందుకు బోర్డు ఏర్పాటు చేయాలని డీలర్‌కు సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలను ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తిర్మలాపూర్, దొండ్లపల్లి గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల వివరాల నమోదును పరిశీలించారు.



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ ప్రదీప్‌గౌడ్

ఇష్టారీతిగా వ్యవహరిస్తే సహించం



మాట్లాడుతున్న బచ్చిరెడ్డి

రాజాపూర్: కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార బలంతో ఇష్టారీతిగా వ్యవహరిస్తే సహించమని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు కొప్పెరి బచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అనివార్య కారణాలతో రాలేదని స్థానిక కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అభివృద్ధికి తాము సహకరిస్తామని.. కానీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మరిన్ని చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, నర్సింహులు, కిషన్, అచ్చయ్య, సత్యయ్య, అల్లె శ్రీను ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లికి చెందిన ఎండీ పీర్ మహ్మద్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. అతడి వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. లక్ష 11వేల చెక్కును గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దేవరాజు, కృష్ణయ్య, శ్రీనివాసులు, మన్నెపురెడ్డి, రసూల్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక డబ్బు ఆశ చూపి మోసం

జడ్చర్ల: టెలిగ్రామ్ గ్రూప్‌లో పరిచయమైన నలుగురు వ్యక్తులు అధిక డబ్బు ఆశ చూపి మోసం చేశారని స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సిమ్రిన్ బీకే గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 15న తన వాట్సప్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి టెలిగ్రామ్ గ్రూప్‌లో జాయిన్ అయ్యాయని.. ఒక అకౌంట్ నంబర్‌ను వారు క్రియేట్ చేయగా రివ్యూలు ఇచ్చినట్లు బాధితుడు తెలిపారు. అందుకు వారు తన అకౌంట్‌లో డబ్బులు జమ అయినట్లు చూపించారని పేర్కొన్నారు. అందులో జమ అయిన డబ్బులు రావాలంటే తాను కొంత డబ్బు జమచేయాలని వారు చెప్పడంతో దశల వారీగా రూ. 60 వేలు జమ చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ తనకు డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించానని తెలిపారు. ఈ మేరకు సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పాలమూరు: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని.. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ డి.జానకి హెచ్చరించారు. గురువారం సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాడీస్ రోడ్డు సేఫ్టీ ఆఫ్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వాహన దారులు రోడ్డు ప్రమాదానికి గురైతే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పాటు ప్రాణాలు రక్షించడం, రక్తదాతలకు సమాచారం ఇచ్చేందుకు డాడీస్ రోడ్డు సేఫ్టీ ఆఫ్ క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుందని తెలిపారు. డాడీస్ యాప్‌తో వాహన దారుల భద్రతకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, రూరల్ సీఐ గాంధీనాయక్, ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, నాగరాజు, కుర్మయ్య పాల్గొన్నారు.



డాడీస్ యాప్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్పీ డి.జానకి

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ తిరుపతయ్య గురువారం తెలిపారు. అదేవిధంగా జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఎమ్మెల్యే ముఖాముఖి కార్యక్రమం, రైతువేదికలో రుణమాఫీపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రిని పరిశీలించిన కేంద్ర ఆడిట్ బృందం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను గురువారం కేంద్ర ఆడిట్ బృందం సతీష్ కుమార్, శివ కుమార్, రవికుమార్ సందర్శించి గత ఐదు సంవత్సరాల రికార్డులను పరిశీలించడం జరిగిందని వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. వారి వెంట జిల్లా అధికారి రమేష్ పాల్గొన్నారు.



మిడ్జిల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర అడిట్ బృందం సభ్యులు.

కూలిన ఇళ్ల పరిశీలన

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలం పేరూర్‌లో వర్షానికి కూలిన ఇళ్లను గురువారం తహసీల్దార్ ఎల్లయ్య పరిశీలించారు. పూర్తిగా కూలిన, పాక్షికంగా దెబ్బ తిన్న ఇళ్ల వారికి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్ఐ జమీల్, సాగర్, బండారి శ్రీనివాస్, వెంకటేష్ ఉన్నారు.

విధిగా మొక్కలు పెంచాలి

హన్వాడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధులు రాయుడు ప్రకాష్, రవికుమార్ అన్నారు. గురువారం బుద్ధారం గ్రామంలో రైతులకు 10 రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.